క్లుప్తంగా

విరాళం అందజేత



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం ముంబయికి చెందిన అన్నం శ్రీనివాస్, పురుషోత్తం కలిసి రూ15,500లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సంజీవ చార్యులు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఓ బాధిత కుటుంబానికి శుక్రవారం రూ.2 లక్షల 50 వేల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన తిరుపతి లక్ష్మి భర్త తిరుపతి రమేశ్ అనారోగ్యంతో ఉండటంతో విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆపరేషన్ నిమిత్తం ఎల్‌వోసీని మంజూరు చేయించారని తెలిపారు. విండో చైర్మన్ సదాశివరెడ్డి, సంకరి రాజలింగం, ఆకుల సిద్ధిరాములు, సాదిక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నేతలు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇమామ్, నాయకులు మన్నె వెంకటి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏసీబీ దాడులు నిర్వహించాలి



కామారెడ్డి టౌన్: అసైన్‌మెంట్ భూములను పట్టా భూములుగా మార్చిన తహసీల్దార్లపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు సీపీఎం ప్రచారంలో భాగంగా తమ దృష్టికి చాలా విషయాలు వచ్చాయన్నారు. అందులో ప్రధానంగా వివిధ గ్రామాలలో రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు భూములను కబ్జా చేసి లంచం ముట్టజెప్పి రెవెన్యూ అధికారుల నుంచి అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. తక్షణమే అలాంటి అవినీతి తహసీల్దార్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకట్‌గౌడ్, మోతీరాం, నర్సింలు, సురేష్, అజయ్, అరుణ్ తదితరులున్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



మద్నూర్(జుక్కల్): గత సంవత్సరం మద్నూర్ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పూర్తిగా పడిపోయిందని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని జిల్లా నోడల్ అధికారి సలాం సూచించారు. మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం జిల్లా నోడల్ అధికారి సలాం తనిఖీ చేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షలు దగ్గరికి వస్తున్నాయని సిలబస్ త్వరగా పూర్తి చేసి రివిజన్ చేయాలని ఆయన సూచించారు.

కేజీబీవీలో భోజనం పరిశీలన



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో భోజనం పరిశీలించారు. సమగ్ర సర్వశిక్ష అభియాన్ ద్వారా పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతు సమ్మెలో ఉన్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందే విధంగా చూడాలని జిల్లా అధికారులను నుంచి ఎంఈవోకు ఆదేశాలు అందాయి. ప్రతి రోజు కేజీబీవీకి వెళ్లి భోజనం పరిశీలిస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నామని సూచించారు. రుచిరమైన భోజనం వండాలని వంట నిర్వాహకులను ఆదేశించారు.

వంతెనలు నిర్మించారు.. రోడ్డు మరిచారు

- మండలంలో నూతన వంతెనల వద్ద వేయని బీటీ(డాంబర్)
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



కొండాపూర్ బ్రిడ్జి వద్ద కంకర వేసి వదిలేసిన రోడ్డు



అన్నారం వంతెన వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

రాజంపేట: కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, అన్నారం గ్రామాల పరిధిలో నూతన బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో వంతెన నిర్మాణం రూ.3 కోట్ల 43 లక్షలతో చేపడుతున్నారు. కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య నూతన వంతెన పనులు గతేడాది వర్షాకాలం కంటే ముందే పనుల ప్రారంభించినప్పటికీ వర్షాకాలంలో పనులకు కాస్త ఆటకం కలిగింది. అనంతరం పనుల వేగవంతం పెరిగినా ప్రస్తుతం మాత్రం పనులు నత్త నడకనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నప్పటికీ సంబంధిత వంతెనలకు బీటీ రోడ్డు ఎప్పుడు వేస్తారోనని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

ప్రమాదకరంగా అన్నారం వంతెన..

అన్నారం గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం ప్రారంభమై 8 నెలలు కావస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ ఇంకా బీటీ రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన వద్ద సరైన మొరం, కంకర లేకపోవడంతో వంతెన ప్రారంభం వద్ద మట్టి కృంగిపోయింది.

దీంతో అక్కడ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ కారు సైతం అదుపు తప్పి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్లు, అధికారులు స్పందించి వంతెన వద్ద పూర్తి స్థాయి పనులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



అన్నారం బ్రిడ్జి వద్ద ఇటీవల ప్రమాదానికి గురైన కారు(ఫైల్)

పనులు త్వరగా జరిగేలా చూడాలి



అన్నారం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న నూతన వంతెన నిర్మాణ పనులు త్వరగా చేపట్టేలా చూడాలి. వంతెన వద్ద మట్టి కృంగిపోవడంతో రాత్రి సమయంలో చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. అధికారులు, కాంట్రాక్టరులు స్పందించి ప్రమాదాలు జరగకుండా పనులు చేపడితే బాగుంటుంది. – మెగావత్ రాజు, అన్నారం తండా

గోపాల్‌పేట హైస్కూల్‌కు 'మాటా' చేయూత

- రూ.లక్ష విలువైన సామగ్రి అందజేత



పాఠశాలలో వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట హైస్కూల్‌కు అమెరికాలోని మాటా(మిన్నెసోటా ఏరియా తెలంగాణ అసోసియేషన్) సంస్థ చేయూతనిచ్చింది. మాటా సంస్థ డైరెక్టర్ ముత్యపు సందీప్‌కుమార్ సహకారంతో పాఠశాలకు రూ.లక్ష విలువైన వివిధ రకాల సామగ్రి సమకూరింది. పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాస్ తమ పాఠశాలకు సహాయం అందించాలని అమెరికాలోని మాటా సంస్థ డైరెక్టర్ సందీప్‌కుమార్‌ను సంప్రదించారు. దీంతో పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్, రెండు బీరువాలు, సైన్స్ మెటీరియల్, గ్రంథాలయ పుస్తకాలు, మ్యాథ్స్ కిట్, గేమ్స్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్నారు. మాటా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని చెప్పారు. మాల్తుమ్మెద హైస్కూల్ హెచ్‌ఎం వెంకట రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



మద్నూర్(జుక్కల్): మండలంలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి శుక్రవారం మండల మాజీ సర్పంచులు తరలివచ్చి ఎంపీడీవో రాణికి వినతి పత్రం అందించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబీలు, బిల్లులు అధికారులకు అందించి సుమారు రెండు సంవత్సరాలు అవుతోందని, అయినా ఇంత వరకు బకాయి బిల్లులు రాలేదని వాపోయారు. అప్పులు తీసుకొచ్చి పనులు చేపట్టామని, ఇప్పటికీ వడ్డీలు కడుతూనే ఉన్నామన్నారు. వారం రోజుల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని లేకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ సూచించారు. శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్‌ఎం సావిత్రిరెడ్డిని ఆదేశించారు. కౌన్సిలర్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతుకు బేడీలు వేయటం సిగ్గుచేటు'



జిల్లా కేంద్రంలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనను నిరసిస్తూ బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. లగచర్ల రైతులను ఉగ్రవాదుల్లాగా చేతులకు బేడీలు వేసుకుని ఆస్పత్రికి తరలించడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనకి, కేసీఆర్ పాలనకి తేడా లేదని, మారింది పాలకులే తప్ప పాలన కాదన్నారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పడుతుందని విమర్శించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గుండె నొప్పితో బాధపడుతున్న రైతును నడుచుకుంటూ ఆస్పత్రికి తీసుకెళ్లడం దారుణమన్నారు. నాయకులు వేణు, రవీందర్, రాజు, రజనీకాంత్, రాజేష్, రాజగోపాల్, సాయి, గోవర్ధన్, మహేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నూతన లిఫ్ట్ ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను శుక్రవారం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా ప్రారంభించారు. మూడు అంతస్తులున్న ఈ ఆస్పత్రిలో రోగులు, వైద్యులు సులువుగా వెళ్లేందుకు ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు వెంకట్, సిబ్బంది తదితరులున్నారు.

మదర్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రాజంపేట: మహిళా సంఘ సభ్యులు ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా అందిస్తున్న మదర్ యూనిట్(నాటు కోళ్ల పెంపకం)ను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీవో సక్కుబాయి అన్నారు. శుక్రవారం ఆర్గొండ గ్రామ సంఘం సభ్యురాలైన తుల మమత నాటు కోళ్ల పెంపకం షెడ్డు నిర్మాణం కోసం మార్కింగ్ ఇచ్చారు. ఎంపీడీవో రఘురాం, సీసీ సాయిలు, టీఏ రాజు పాల్గొన్నారు.

సత్తా చాటిన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అంతర కళాశాలల టోర్నమెంట్‌లో మండలంలోని మర్కల్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఎంఎస్‌డీఎస్ ఫస్టియర్ చదువుతున్న వైష్ణవి డిస్కస్‌త్రోలో గోల్డ్ మెడల్ సాధించింది. ఎంటీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న శ్రీవిద్య, జావెలిన్‌త్రోలో సిల్వర్ మెడల్ సాధించింది. ఎంఎస్‌డీఎస్‌లో ఫస్టియర్ చదువుతున్న అమృత సౌత్ జోన్ వాలీబాల్ పోటీకి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ ఉదయిని, పీడీ రమాదేవి, శ్రావణి అధ్యాపకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పెద్ద తడ్గూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఏవో

మద్నూర్(జుక్కల్): యాసంగిలో వేసిన పంటలకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో రాజు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తడ్గూర్‌లో శుక్రవారం యాసంగిలో సాగు చేస్తున్న శనగ, మినుము, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వరి, కంది పంటలను ఆయన పరిశీలించారు. శనగలో ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 600 గ్రాములు లేదా టేబుకొనజోల్ 200 మిల్లీ లీటర్‌ను, 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. శనగలో తొలిదశలో రబ్బరు పురుగు గమనించినట్లయితే నోవాల్యురాన్ 200 మీ.లీ లేదా క్వినల్ఫస్ 200 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఏఈవో అనిల్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



గోర్గల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్



ఎర్రకుంటతండాలో .. ఎంపీడీవో ప్రభాకరచారి

ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతోంది. సర్వే జరుగుతున్న తీరును శుక్రవారం పలువురు అధికారులు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పూర్తి వివరాలు సేకరించి అసలైన అర్హులను గుర్తించాలని వారు సూచించారు. పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఎక్కించాలన్నారు. సర్వే కోసం వచ్చే అధికారులు అడిగే డాక్యుమెంట్లను చూపుతూ వారికి సహకరించాలని ప్రజలను కోరారు. – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయిలో.. ఆర్డీవో రంగనాథ్ రావు



లింగంపేట పరిధిలో.. ఎంపీడీవో నరేష్



రాజంపేటలో ..



జిల్లా కేంద్రంలో 46వ వార్డులో..

మెప్మా ఆర్పీల ముందస్తు అరెస్టు



కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆర్పీలు



ఎల్లారెడ్డిలో ..

కామారెడ్డి టౌన్: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు తరలివెళ్తున్న మెప్మా ఆర్పీలను పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేశారు. ధర్నాకు వెళ్లడానికి ఉదయం కామారెడ్డి బస్టాండ్‌కు చేరుకున్న ఆర్పీలను పోలీసులు అడ్డుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు భారతి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ధర్నాకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ఎన్నో రకాలుగా ప్రజలకు సేవలు చేస్తున్న తమకు చాలీచాలనీ వేతనం అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డి: మెప్మా ఆర్పీలను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్పీలు చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించ తలపెట్టడంతో వారిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

'హలో కురుమ.. చలో కోకాపేట్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

బాన్సువాడ: హైదరాబాద్‌లోని కోకాపేట్ ప్రాంతంలో ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులతో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవం శనివారం చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హర్యానా గవర్నర్ దత్తాత్రేయతో పాటు పలువురు మంత్రులు విచ్చేసి మార్గదర్శకం చేయనున్నారని పేర్కొన్నారు. కుర్మ సంఘం నాయకులు స్వచ్ఛందంగా రావాలని కోరారు. పర్వ గొండ, రమేష్, గంగారాం, సాయిలు, బీర్ గొండ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం



గొడ్మెగాంలో చికిత్స చేస్తున్న పశు వైద్యులు

పిట్లం(జుక్కల్): పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గొడ్మెగాంలో శుక్రవారం పశువులకు ఉచిత గర్భకోశవ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ.. చలికాలంలో పశువులు ఎదకు వస్తాయని, రైతులు సకాలంలో గుర్తించి అందుబాటులో ఉన్న గోపాలమిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించినట్లయితే మంచి మేలు దూడలు పుడతాయన్నాయి. ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. సూపర్‌వైజర్ బస్వరాజ్, గోపాల మిత్రలు పండరి, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నాలుగు ఫోన్ల అప్పగింత



భిక్కనూరు: ఫోన్లు పోగొట్టుకున్న నలుగురికి భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరి చేసి శుక్రవారం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాలకు బీజేపీ బూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డి 92వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా బి.రమేశ్ రెడ్డిని నియమించినట్లు తెలిపారు. బీజేపీ ఉపాధ్యక్షుడు చక్రధర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, లింగారావు, సంకరి విఠల్, భాస్కర్ రెడ్డి, పోలబోయిన సాయిలు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రచార ఉద్యమం

బీబీపేట: భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పర్‌పల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్, శంకర్, లక్ష్మణ్, సాయిలు, నరేష్, ప్రసాద్, బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతుంది. బుధవారం నాటికి 96 వేల 360 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జిల్లా రైతులు విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా విద్యుత్ విభాగ్ ప్రతినిధి రాజాగౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి రుణమాఫీ, ప్రతి పంటకు రూ.500 బోనస్, రైతు భరోసా రూ.15 వేలు అమలు చేయాలని డిమాండు చేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ



మాచారెడ్డి: మండల కేంద్రంలోని సెయింట్ జాన్స్ ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి అందరిని అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ మాట్లాడారు. విద్యార్థులకు పాలనా పరమైన విషయాలపై అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.